క్లుప్తంగా

1 నుంచి ఆధ్యాత్మిక ప్రవచనాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో మార్చి 1, 2, 3 తేదీల్లో ఆధ్యాత్మిక ప్రవచనాలను నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. సనాతన ధర్మం – ధర్మాచరణము అనే అంశంపై గడ్డమణుగు తేజస్వి శర్మ ప్రవచనాలు ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు ఉంటాయని ఆయన వివరించారు. భక్తులు ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ఆకట్టుకున్న హరికథా కాలక్షేపం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం హరికథా సప్తాహం సందర్భంగా యడవల్లి రమణయ్య భాగవతార్ ఆధ్వర్యంలో నిర్వహించిన భూకైలాసం హరికథ అందరిని అలరించింది. పలు ప్రాంతాలకు చెందిన భాగవతార్, భాగవతారిణులతో సోమవారం వరకు హరికథా కాలక్షేపం రోజు సాయంత్రం 5 గంటలకు ఉంటుందని ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి తెలిపారు.

నేటి నుంచి ఎన్నికల ప్రచారం

రాజుపాళెం : మండలంలో బుధవారం నుంచి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఆయన సోదరుడు రాచమల్లు కిరణ్‌కుమార్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు జీరెడ్డి అంజనీకుమారి తెలిపారు. ముందుగా వెల్లాల పుణ్యక్షేత్రంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపాక గోపాయపల్లె గ్రామంలో ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం చేస్తారన్నారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని వారు కోరారు.

నేడు 'ఫ్యామిలీ డాక్టర్'

చాపాడు : మండలంలోని వి.రాజుపాళెం గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి ఓబులేసు తెలిపారు. గ్రామ కూడలిలో ఉదయం గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ వైద్య శిబిరంలో అన్ని రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులను పంపిణీ చేస్తామని తెలిపారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : అమృతా నగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ అమృతానగర్‌లో పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చిందన్నారు. అక్కడ ఎటువంటి మౌలిక వసతులు కల్పించకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను కొందరు ఆక్రమించి అమ్ముకుంటున్నారని చెప్పారు. వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హసీనా, పుష్పలత, మల్లికాభాను, గోవిందమ్మ, శంషాద్, షకీలా, మధు, హరి తదితరులు పాల్గొన్నారు.

29న జాబ్ మేళా

ప్రొద్దుటూరు : మండలంలోని హౌసింగ్ బోర్డులో ఉన్న మండల సమాఖ్య కార్యాలయంలో ఈ నెల 29న ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఏపీ లావణ్య, ఏపీఎం సుబ్బమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. డి మార్ట్‌లో 45 పిక్కర్స్, ప్యాకర్స్, క్యాషియర్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివి 18–25 ఏళ్లలోపు ఉన్న వారు అర్హులని వివరించారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 900040132 సంప్రదించాలని కోరారు.

బీజేపీ ప్రజాపోరు

చాపాడు: మండల పరిధిలోని గుంతచీపాడు, బసిరెడ్డిపల్లె, టీఓపల్లె, రేపల్లె గ్రామాల్లో మంగళవారం సాయంత్రం బీజేపీ ఆధ్వర్యంలో ప్రజా పోరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మాచనూరు చంద్ర, చాపాడు మండల అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు నాలుగు గ్రామాలలోకి వెళ్లి ప్రజలతో మాట్లాడి వారి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోపాల్‌రెడ్డి, పూజారి లక్షుమయ్య, ఎల్లారెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అండర్ పాస్ రోడ్డు వేయాలని గ్రామస్తుల ధర్నా

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీలోని గడ్డమాలవాడ వద్ద నెల్లూరు–బళ్లారి జాతీయ రహదారి బైపాస్‌కు అండర్ పాస్ రోడ్డు వేయాలని గడ్డమాలవాడ గ్రామస్తులు మంగళవారం బైపాస్ నిర్మాణం వద్ద ధర్నా నిర్వహించారు. బైపాస్ నుండి తమ పొలాలకు వెళ్లేందుకు అండర్ పాస్ రోడ్డు వేయాలని డిమాండ్ చేస్తూ వారు పనులను అడ్డుకున్నారు. రోడ్డు అడ్డుగా వేయడం వల్ల ఆ వైపున ఉన్న తమ పొలాలకు వెళ్లేందుకు అవకాశం ఉందని తెలిపారు. తమ పొలాల వద్దకు రోడ్డు వేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు.

బీజేపీ యువమోర్చా సభ్యుడిగా మనోహర్‌రెడ్డి

కాశినాయన : గంగన్నపల్లెకు చెందిన బుసిరెడ్డి మనోహర్‌రెడ్డి బీజేపీ యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను శక్తివంచన లేకుండా నిర్వర్తించి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతానని తెలిపారు.

85 శాతం మంది వైఎస్సార్‌సీపీకే మద్దతు

- ప్రజలు ఏకపక్షంగా తీర్పునిచ్చేందుకు సిద్ధం
- 12 వార్డులో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, నాయకులు

ప్రొద్దుటూరు : జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధి పనుల కారణంగా 85 శాతం మంది రాష్ట్ర ప్రజలు వైఎస్సార్‌సీపీకే మద్దతు ఇస్తున్నారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ ఖాజా ఆధ్వర్యంలో మంగళవారం రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఆయన సతీమణి, 26వ వార్డు కౌన్సిలర్ రాచమల్లు రమాదేవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 12వ వార్డులో 80 శాతం మంది ముస్లిం మైనారిటీ ప్రజలు నివసిస్తున్నారన్నారు. వీరంతా పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన వారు కావడంతో జగనన్న పథకాలు బాగా ఉపయోగపడ్డాయన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఏకపక్షంగా తీర్పు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. 12వ వార్డులో ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందన్నారు. జగనన్నకు ఓటు వేస్తామని గంటాపదంగా చెబుతున్నారన్నారు. పట్టణంలో రూ.150 కోట్ల అమృత్ పథకాన్ని పూర్తి చేసి ఇంటింటికి నీరు అందించామని చెప్పారు. వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేశారన్నారు. వార్డులో రూ.కోటి 20లక్షలతో అభివృద్ధి పనులు, రూ.21.35 కోట్ల సంక్షేమ పథకాలను ప్రజలకు అందించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, మాజీ కౌన్సిలర్ పాతకోట కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకులు హనీఫ్, నిజాం, హిబ్రీష్, గైబుసా, ఉస్మాన్, ఖాదర్, ఆసిఫ్, సాదక్, రాచమల్లు రాఘవేంద్రారెడ్డి, పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షురాలు మద్దూరి దేవి, వనజ, కొండా ధనలక్ష్మి, జి.పద్మావతి, కమ్మక్క, జి.కళావతి, ఉప సర్పంచ్ ఎం.కృష్ణారెడ్డి, సర్పంచ్ ఎం.ప్రశాంతి, ఎంపీపీ శేఖర్ యాదవ్, కింగ్ బాషా పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం పరిశీలన

ఆటో నగర్‌లో నిర్మిస్తున్న సిమెంటు రోడ్డును ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ఆటో నగర్ కార్మికులు పడుతున్న ఇబ్బందులను గమనించి ఎమ్మెల్యే తన సొంత నిధులు రూ.2కోట్లతో సిమెంటు రోడ్డును నిర్మిస్తున్నారు. పనుల పురోగతిని ఎమ్మెల్యే పరిశీలించారు.

అత్యవసర సమయాల్లో పశువులకు మెరుగైన వైద్యం


సంచార పశు ఆరోగ్య సేవ వాహనాన్ని తనిఖీ చేస్తున్న కలీమ్, ఏడీ సుమన్ కుమార్ తదితరులు

మైదుకూరు : అత్యవసర సమయాల్లో పశువులకు డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా వాహనాల ద్వారా మెరుగైన వైద్యం అందిస్తున్నామని జీవీకే సంస్థ రీజనల్ మేనేజర్ కలీమ్ తెలిపారు. మంగళవారం మైదుకూరులోని ప్రాంతీయ పశువైద్యశాల వద్ద సంచార పశు ఆరోగ్యసేవా వాహనాన్ని పశు వైద్యులతో కలసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలీమ్ మాట్లాడుతూ పాడి రైతులకు చెందిన పశువులకు ఇళ్ల వద్దనే మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ వాహనాలను ప్రవేశెట్టిందన్నారు. అత్యవసర సమయంలో రైతులు టోల్ ఫ్రీ నంబర్ 1962 నంబర్‌కు ఫోన్ చేస్తే, వాహన సిబ్బంది రైతుల ఇంటి వద్దకే చేరుకుని పశువులకు ఉచిత వైద్యం అందిస్తారన్నారు. అదే విధంగా మందులను కూడా ఉచితంగా ఇస్తారని పేర్కొన్నారు. మైదుకూరు పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ సుకుమార్ మాట్లాడుతూ మైదుకూరు నియోజకవర్గానికి రెండు వైఎస్సార్ సంచార పశుసేవా వాహనాలు ఉన్నాయని తెలిపారు. పశువులకు చికిత్స అందించేందుకు అవసరమైతే రెండు వాహనాలను కూడా వస్తాయన్నారు. కార్యక్రమంలో జీవీకే సంస్థ జిల్లా అధికారి అనిల్ కుమార్, పశువైద్యులు గురివిరెడ్డి, సుధాకర్, గౌస్, సుదర్శన్‌రెడ్డి, వెంకటప్రసన్న పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు కమిషనర్‌గా రఘునాథరెడ్డి



ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్‌గా జి.రఘునాథరెడ్డిని నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లా ఆదోని మున్సిపాలిటీలో పని చేస్తున్న ఈయనను ప్రొద్దుటూరుకు బదిలీ చేయగా, ఇక్కడ పని చేస్తున్న మల్లికార్జునను సీడీఎంఏలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

ఎన్నికలపై దిశానిర్దేశం

రాజుపాళెం : విజయవాడలో సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. మంగళవారం మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ సమావేశంలో పలువురు మండల నాయకులు పాల్గొన్నారు. సమావేశానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల కన్వీనర్లు మార్తల ఓబులరెడ్డి, గుద్దేటి రాజారాంరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామంలో ఇంటింటికి వెళ్లి మనం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించాలని తెలియజేశారన్నారు. అలాగే బూత్ కమిటీ ప్రాధాన్యత, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో పార్టీ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు.

ఇన్నోవేషన్ ద్వారా నైపుణ్యాల గుర్తింపు



మాట్లాడుతున్న సత్యభామ ఇన్నోవేషన్ కౌన్సిల్ హెడ్ ప్రభాకరన్

చాపాడు: ఇన్నోవేషన్ కార్యక్రమాలు నిర్వహించటం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను గుర్తించవచ్చని సత్యభామ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇంకుబేటర్ డానియల్ ప్రభాకరన్ అన్నారు. స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)లో మంగళవారం ఇంజినీరింగ్, ఎంబీఏ, డిప్లొమో విద్యార్థులకు సీబీఐటీ ఐడియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో ఐడియాథాస్–2కె 24 పేరుతో ఇన్నోవేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డానియల్ ప్రభాకరన్ మాట్లాడుతూ.. కాలేజీలలో ఇన్నోవేషన్ కార్యక్రమాలు నిర్వహించటం వలన విద్యార్థుల్లో ప్రతిభా నైపుణ్యాలు బయటికి వస్తాయన్నారు. భవిష్యత్తులో తమంతట తాము సొంతంగా కంపెనీలను స్థాపించవచ్చన్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన పలు రకాలైన ప్రాజెక్టు నమూనాలను పరిశీలించారు. ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీబీఐటీ ప్రిన్సిపాల్ డా.జి.శ్రీనివాసులరెడ్డి, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

కాశినాయన : తాగునీటి సమస్య లేకుండా పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ వీరన్న తెలిపారు. మంగళవారం మండలంలోని నీటి ఎద్దడి గ్రామాలైన గంగన్నపల్లె, గొంటువారిపల్లె, బాలాయపల్లె, వరికుంట్ల, నాయునిపల్లె, ఆకులనారాయణపల్లె, సావిశెట్టిపల్లె గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుగంగ కాలువకు పైభాగాన ఉన్న గ్రామాల్లో నీటి సమస్య వేసవిలో ఎదురవుతుందన్నారు. అందుకు అనుగుణంగా ప్రణాళికలు తయారు చేస్తున్నామని, ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మితిమీరిపోతున్న భూ ఆక్రమణలు

- ప్రేక్షకపాత్ర వహిస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులు


జగనన్న లేఅవుట్‌లో సీపీఐ ఆధ్వర్యంలో వేసిన గుడిసెలు

గోపవరం : మండలంలో రోజురోజుకు భూ ఆక్రమణలు మితిమీరిపోతున్నాయి. ఎక్కడ ప్రభుత్వ స్థలం కనిపించినా వామపక్ష పార్టీలు పేదలను రెచ్చగొట్టి గుడిసెలు వేయిస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ, పోలీసు అధికారులు చేతులెత్తేయడంతో వారి ఆగడాలకు అంతులేకుండా పోతోంది. చివరకు పి.పి.కుంట జగనన్న లేఅవుట్‌లో ప్రభుత్వం అర్హులకు కేటాయించిన స్థలాలను కూడా కబ్జా చేసి గుడిసెలు వేశారు. బేతాయపల్లె పంచాయతీలో గోపవరం రెవెన్యూ పొలం 1557, 1622 సర్వే నెంబర్లలోని ప్రభుత్వ స్థలంలో 20 రోజులుగా పేదలు గుడిసెలు వేస్తున్నారు. వీరిలో దాదాపు 70 శాతం మంది స్థానికేతరులు కావడం గమనార్హం. నెల్లూరు – ముంబై జాతీయ రహదారి పక్కనే ప్రభుత్వ స్థలాలు ఉండటం, అది కూడా సెంచురీ పానెల్స్ పరిశ్రమకు దగ్గర కావడంతో సెంటు స్థలం కనబడినా పోటాపోటీగా అక్రమ గుడిసెలు వేస్తున్నారు. పి.పి.కుంట జగనన్న లేఅవుట్‌లో సుమారు 60 మందికి పైగా ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసింది. వీరిందరికి త్వరలో పట్టాలు కూడా పంపిణీ చేయాల్సి ఉంది. సీపీఐ నాయకులు పేదలను రెచ్చగొట్టి లేఅవుట్‌కు కేటాయించిన స్థలంతో పాటు పక్కన ఉన్న ప్రభుత్వ భూమి కూడా ఆక్రమించి గుడిసెలు వేయించారు. కాగా అర్హత ఉండి ఇప్పటికీ స్థలం లేని వారికి ఆయా సచివాలయాల పరిధిలో వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకుంటే వెంటనే స్థలం మంజూరు చేయడం చేస్తున్నారు. ప్రతి సచివాలయం పరిధిలో జగనన్న లేఅవుట్లను పేదల కోసం కేటాయించారు. ఇంత మంచి అవకాశం ఇచ్చినా ఇంకా వందల సంఖ్యలో గుడిసెలు వేస్తున్నారంటే నిజంగా వీరికి ఇళ్లు లేవా లేక సీపీఐ నాయకుల ఉచ్చులో ఇరుక్కున్నారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి రెవెన్యూ, పోలీసు అధికారులు గుడిసెలు వేసిన ప్రాంతాలను పరిశీలించారు. రెండు రోజుల్లో ఆధార్‌కార్డులు తీసుకువచ్చి అధికారులకు చూపించి ఇప్పటి వరకు స్థలం లేకపోతే వారందరికి కూడా ఆయా సచివాలయాల పరిధిలో స్థలాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. లేనిపక్షంలో స్వచ్ఛందంగా తొలగిస్తే ఎలాంటి చర్యలు తీసుకోమని తెలిపారు. అధికారులు ఇచ్చిన గడువు నేడు (బుధవారం) సాయంత్రంతో ముగియనుంది. అధికారులు అక్రమంగా గుడిసెలు వేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

ఘనంగా జాతీయ సైన్స్ డే

కలసపాడు: స్థానిక సెయింట్ ఆంటోనీస్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సైన్స్‌ఫేర్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంఈఓ మస్తాన్‌వలి, ఎస్ఐ నాగమురళి, ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి పి.రమణారెడ్డి, అమెరికా దేశస్తుడు గ్రేగ్ కో జాక్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం ఇప్పుడు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లడానికి కారణం సైన్స్ అని అన్నారు. సైన్స్ ప్రయోగాలు చేయడం వలన విద్యార్థి మేథోశక్తిని పెంపొందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు చేసిన నమూనాలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుకు వచ్చి దేశ ఔన్నత్యాన్ని కాపాడాలని, ప్రతి విద్యార్థి కష్టపడి చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు, దేశానికి ఉపయోగపడే భావిభారత పౌరులుగా ఎదగాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు చిత్తా బాలిరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు చిత్తా ప్రభావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో విద్యార్థుల ఎంపిక

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కాలేజీలో ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఉద్యోగాలకు విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాండురంగన్ రవి తెలిపారు. మంగళవారం టీపీఓ ఉద్యోగాలకు టెక్ మహీంద్ర కంపెనీ వారు ఫుల్ క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా 357 మంది విద్యార్థులు హాజరయ్యారని, వారిలో 57 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఏపీఎస్‌ఎస్‌డీసీ జిల్లా మేనేజర్ రమేష్ కుమార్ మాట్లాడుతూ ఎంపికైన వారికి రూ.2.2 లక్షల నుంచి రూ.3.2 లక్షల వరకు వేతనం ఇస్తారని పేర్కొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ వీరకళ్యాణ్‌రెడ్డి, టీపీఓ రఫీ, అధ్యాపకులు అభినందించారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి

మైదుకూరు : రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని మైదుకూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ కరీముల్లా, స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.నారాయణరెడ్డి కోరారు. కళాశాలలో మంగళవారం రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు రావని తెలిపారు. అపోహలను వీడి యువత ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయాలని సూచించారు. రక్తదానం చేయడమంటే ప్రాణదానం చేసినట్లేనని పేర్కొన్నారు. శిబిరంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు రక్తదానం చేయగా, వారికి ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, వైద్యాధికారి డాక్టర్ కరీముల్లా సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కృష్ణారెడ్డి, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ అయ్యవారు రెడ్డి, ఐసీటీసీ కౌన్సిలర్ ప్రసాద్, టెక్నీషియన్ బాషా, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

'మా సంఘం ఏ పార్టీకి అనుబంధం కాదు'


మాట్లాడుతున్న నూర్ బాషా దూదేకుల సంక్షేమ సంఘం నాయకులు

మైదుకూరు : తాము ఏర్పాటు చేసుకున్న సంక్షేమ సంఘం ఏ పార్టీకి అనుబంధం కాదని మైదుకూరుకు చెందిన నూర్ బాషా దూదేకుల సంఘం నాయకులు తెలిపారు. మంగళవారం మైదుకూరులో వారు విలేకరులతో మాట్లాడుతూ కొద్ది రోజుల కిందట తాము నూర్ బాషా దూదేకుల సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసుకోగా, అది ఒక రాజకీయ పార్టీకి అనుబంధమని కొందరు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడం శోచనీయమన్నారు. దూదేకుల సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి కోసం మాత్రమే తాము సంఘం ఏర్పాటు చేసుకున్నట్లు సంఘం అధ్యక్షుడు పి.మునెయ్య, ఉపాధ్యక్షుడు జి.మస్తాన్, కోశాధికారి కె.బాలన్న, కార్యవర్గ సభ్యులు స్పష్టం చేశారు. తమ సంఘం ఏ రాజకీయ పార్టీకి మద్దతు తెలపలేదని పేర్కొన్నారు.

సీపీఎస్ రద్దు చేసే వారికే మద్దతు

ప్రొద్దుటూరు కల్చరల్ : సీపీఎస్ రద్దు చేసే పార్టీకే ఉద్యోగ, ఉపాధ్యాయుల మద్దతు ఉంటుందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డీవీ రవీంద్రుడు తెలిపారు. మంగళవారం స్థానిక హోమస్‌పేటలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఓపీఎస్ అమలు చేయకుండా జీపీఎస్ అమలు చేయడం దారుణమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓపీఎస్ అమలు చేసే పార్టీలకే తమ మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నాగరాజు, మోహన్ కుమార్, సరళాదేవి, పార్వతి, లక్ష్మిదేవి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు శైవాగమ వేద పాఠశాల ప్రారంభం

- రూ.60లక్షలతో నిర్మితమైన వేద పాఠశాల భవనం
- ప్రారంభోత్సవానికి హాజరుకానున్న ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు


శైవాగమ వేద పాఠశాల నూతన భవనం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శైవాగమ వేద పాఠశాల విద్యార్థుల కోసం నూతనంగా నిర్మించిన భవనాన్ని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి గురువారం ఉదయం 11 గంటలకు ప్రాంభించనున్నారు. ఈ పాఠశాలను 1981లో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ప్రారంభించారు. 1989లో వేదపాఠశాల గురువు వేరే పాఠశాలకు వెళ్లడంతో పాఠశాలను మూసివేశారు. 2001లో తిరిగి వీరభద్రశర్మ గురువుగా పాఠశాలను ప్రారంభించారు. రాయలసీమ జిల్లాలతోపాటు తెలంగాణ రాష్ట్రానికి చెందిన వేద విద్యార్థులు వేదాల్లోని ముఖ్య అంశాలు అయిన మంత్రభాగం, ఆగమాలు, జ్యోతిష్యంలో అవసరమైన వాటిని అభ్యసిస్తున్నారు. దాదాపు 1000 మందికి పైగా విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుకుని రాష్ట్రంతోపాటు దేశంలోని పలు ప్రాంతాల్లో అర్చకులుగా, వేదపండితులుగా రాణిస్తున్నారు. ఈ పాఠశాలకు సొంత భవనం లేకపోవడంతో శివాలయంలోని ఒక గదిని, టూరిజం బంగ్లాలో వీరు ఉంటున్నారు. వేద పాఠశాల కోసం కామన్ గుడ్ ఫండ్ రూ.60 లక్షలతో భవనం నిర్మించారు. దీని ద్వారా వేద విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని వేద పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటేశ్వరశర్మ తెలిపారు. రాష్ట్రంలో శైవాగమంలో వేద విద్యను అందించే ఏకైక పాఠశాల ఇదేనని పేర్కొన్నారు. ఈ పాఠశాలలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 28 మంది విద్యార్థులు ప్రవేశ, వర, ప్రవర విభాగాల్లో వేద విద్యను అభ్యసిస్తున్నారని చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డితో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తదితరులు హాజరవుతారని తెలిపారు.

అలాగే వాహనశాలను రూ.16.50 లక్షలతో, గోకులాన్ని రూ.13లక్షలతో, రథం షెడ్ రూ.6.5 లక్షలతో, గోలిగోపురం, కాలక్షేప మండపానికి రూ.6.7 లక్షలతో రంగులు వేసినట్లు ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, దేవాదాయశాఖ ఏసీ, ఈఓ శంకర్‌బాలాజీ వివరించారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న డాక్టర్ శివప్రసాద్ రెడ్డి

ప్రొద్దుటూరు : మార్చి 3న చేపట్టే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సభా భవనంలో మంగళవారం ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలకు, వలంటీర్లకు పల్స్ పోలియో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్, ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ మార్చి 3న (ఆదివారం) అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని తెలిపారు. పోలియో చుక్కలు వేయడం ద్వారా పిల్లలకు అంగవైకల్యం రాకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. పల్స్ పోలియో కార్యక్రమం గురించి వ్యాక్సినేటర్స్‌కు శిక్షణ ఇస్తున్నామన్నారు. పట్టణ పరిధిలో 102 బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి బూత్‌లో నలుగురు వ్యాక్సినేటర్స్ ద్వారా పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ నజీర్, డాక్టర్ హిమబిందు, డాక్టర్ భరత్‌నారాయణ, డాక్టర్ పూజిత, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, రూట్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

గోపవరం : మార్చి 3న నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి వి.మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బద్వేలు ఎన్‌జీవో హోంలో పల్స్‌పోలియో సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పుడే పుట్టిన చిన్నారి నుంచి ఐదేళ్లలోపు పిల్లలందరికి పోలియో చుక్కలు వేయాలన్నారు. మండల వ్యాప్తంగా 5,600 మంది చిన్నారులు ఉన్నారని, వీరందరికి కూడా ఒకటి, రెండు రోజుల్లోనే పోలియో చుక్కలు వేయాలని, మొదటి రోజు కేంద్రాల్లో పోలియో చుక్కలు వేయని చిన్నారులను గుర్తించి వారి ఇళ్ల వద్దకు వెళ్ళి వేయాలన్నారు. అలాగే పోలియో చుక్కలు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ మురళీకృష్ణ, బద్వేలు మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, సీహెచ్‌ఓ గౌస్, సూపర్‌వైజర్ శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం


మెడికల్ కిట్ అందిస్తున్న డాక్టర్ హేమలత

దువ్వూరు : జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ఎంపీడీఓ సుగుణశ్రీ, డాక్టర్ సురేష్ బాబు తెలిపారు. మంగళవారం మండలంలోని కానగూడూరు గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వారు తనిఖీ చేశారు. వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వైద్య సేవలు అందించాలని సిబ్బందికి తెలిపారు. ఈ వైద్య శిబిరానికి వచ్చిన 370 మందికి డాక్టర్లు హేమలత, శ్రీలలిత, నాగయ్య, చంద్రమౌళి బీపీ, షుగర్, థైరాయిడ్, ఈసీజీ, కంటికి సంబంధించిన వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్లు రాజగోపాల్, విజయకుమారి, సువర్ణ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.